'ఉర్దూ' మధురమైన భాష


మ్యాగజైన్ అల్-కలామ్‌ను ఆవిష్కరించిన వీసీలు ప్రొ.బీజేరావు, ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్

- హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు
- 'మనూ'లో బీబీఎస్ ఉర్దూ ప్రాజెక్ట్ ప్రారంభం

రాయదుర్గం: 'ఉర్దూ' మధురమైన భాష అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు అభివర్ణించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ), భారతీయ భాషా సమితి (బీబీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో మనూలో బీబీఎస్ ఉర్దూ ప్రాజెక్టును ఆయన వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉర్దూ రచయితల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.'మనూ వీసీ, బీబీఎస్ నోడల్ అధికారి ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ విద్యార్థులను ఆకర్షించడానికి ప్రత్యక్ష విధానాన్ని అవలంబించాలని రచయితలకు ఆయన సూచించారు. ఏఎంయూ భాషాశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఇంతియాజ్ మాట్లాడుతూ ఎన్‌ఈపీ మాతృభాషలో విద్యను అందించడంలో ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

బీబీఎస్ ఉర్దూ కార్యాలయంను ప్రారంభించిన వీసీ బీజేరావు

ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని డెక్కన్ స్టడీస్ సెంటర్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీబీఎస్ ఉర్దూ కార్యాలయాన్ని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ప్రారంభించారు. అనంతరం యూనివర్సిటీ మ్యాగజైన్ 'అల్-కలామ్' ప్రత్యేక సంచికను కూడా విడుదల చేశారు. డీటీటీఎల్‌పి కార్యకలాపాలు, విజయాలపై షార్ట్ వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి 60 మంది ఉర్దూ రచయితలు పాల్గొన్నారు.

'స్టడీ ఇన్ ఇండియా' యూనివర్సిటీ ఫెయిర్

శేరిలింగంపల్లి: స్టడీ ఇన్ ఇండియా యూనివర్సిటీ ఫెయిర్‌ను నల్లగండ్లలోని ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. స్కూల్ కెరీర్ డిజైన్ ల్యాబ్ చొరవలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 60 టాప్ ప్రైవేట్ యూనివర్సిటీలు పాల్గొన్నాయి. ముఖ్యంగా అశోక విశ్వవిద్యాలయం, మహీంద్రా, వీఐటీ, ఎస్‌ఆర్‌ఎం, శివ్ నాడార్, జీడీ గోయెంకా, క్రియా, అహ్మదాబాద్, ఇక్ఫాయ్, బిట్స్, క్రిస్ట్ యూనివర్సిటీ వంటివి పాల్గొన్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని ఆయా యూనివర్సిటీలలో అందించే కోర్సులు, అంతర్జాతీయ సహకారం, స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్యాకోర్సుల వివరాలను తెలుసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ పద్మకొల్లి, వైస్ ప్రిన్సిపల్ మర్రి వాణి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు, పాఠశాల ఫ్యాకల్టీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కోర్సుల వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

నగర సంప్రదాయం, కళల పునర్జీవం కోసమే | ప్రజా సంబరాలు

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న ప్రజా సంబరాలు పేరిట అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. కేబీఆర్ ప్రామెనేడ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20న ఆదివారం కేబీఆర్ పార్కు వద్ద మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ప్రజా సంబరాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర సంప్రదాయ, వారసత్వ సంపద సంరక్షణ, మరుగున పడిపోతున్న కళలకు పునర్జీవం పోయడం, ప్రాంతీయ కళాకారులు, ఔత్సాహికులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వివిధ రకాలైన ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేబీఆర్ ప్రామెనేడ్‌లో ప్రజలు కుటుంబంతో సహా ఆస్వాదించేలా సాంస్కృతిక కార్యక్రమాలు, లైవ్ మ్యూజిక్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, ఫన్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రజాసంబరాలకు ఉచిత ప్రవేశం ఉందని, ఆర్ట్స్, పెయింటింగ్ పోటీల్లో పాల్గొనేవారు మాత్రం తప్పనిసరిగా తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. చిత్రకళ పోటీలకు సంబంధించి థీమ్ స్పాట్‌లో అక్కడే ఇవ్వబడుతుందని, చార్ట్ పేపర్, బోర్డు స్కెచ్‌లు ఏర్పాటు చేస్తారని, ఈ పోటీ ఉచితమని, పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి, సర్టిఫికెట్లు అందజేస్తారని, మరిన్ని వివరాలకు ఖైరతాబాద్ జోనల్, జూబ్లీహిల్స్ సర్కిల్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఆర్ట్, పెయింటింగ్‌లో ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెద్దమ్మ గుడిలో సెల్‌ఫోన్ చోరీ

బంజారాహిల్స్: అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలి సెల్‌ఫోన్ చోరీకి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బోడుప్పల్ తారాపురికాలనీకి చెందిన దాసరి చాందిని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జూబ్లీహిల్స్‌లోని శ్రీపెద్దమ్మ దేవాలయానికి దర్శనం కోసం వచ్చింది. దర్శనం ముగించుకుని హ్యాండ్‌బ్యాగ్‌లో సెల్‌ఫోన్ కోసం చూడగా కనిపించ లేదు. వెంటనే పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఆమె జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నవరాత్రుల్లో 17 సెల్‌ఫోన్లు చోరీ

నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన మహిళా భక్తులను లక్ష్యంగా చేసుకుని దొంగల ముఠా వారి సెల్‌ఫోన్లను తస్కరించారు. దీంతో తొమ్మిది రోజుల్లో మొత్తం 17 సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. సుమారుగా 10-15 మంది దొంగల ముఠా తొమ్మిది రోజులపాటు ఇక్కడ తిష్టవేసి పోలీసులకు దొరక్కుండా చాకచాక్యంగా హ్యాండ్‌బ్యాగ్‌లకు చిల్లులు పెట్టి వాటిలోని ఫోన్లను చోరీ చేశారు. ఇదిలా ఉండగా రోజూ వేలాది మంది భక్తులు వస్తారని తెలిసినా పెద్దమ్మ గుడి యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోలేదు. ఇక్కడ భక్తుల తాకిడికి సుమారుగా 60 నుంచి 70 సీసీ కెమెరాలు ఉండాల్సి ఉండగా కేవలం 15 మాత్రమే ఏర్పాటు చేశారు. అందులోనూ నాలుగైదు పనిచేయడం లేదు. ఆలయంలో గొలుసులు, సెల్‌ఫోన్లు చోరీలకు గురవుతున్నాయని గత కొన్నేళ్లుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా గుడి యాజమాన్యం లెక్కచేయడం లేదు. సెల్‌ఫోన్లు దొంగతనం జరిగినప్పుడు సీసీ ఫుటేజీలు పరిశీలించడానికి వెళ్లిన పోలీసులకు కూడా స్పష్టత లేకుండా పోతుంది. దీంతో దొంగల ముఠా ఎప్పటికప్పుడు తప్పించుకుంటూ ఆదివారం వచ్చిందంటే తమ చేతులకు పనిచెబుతున్నారు.

రోడ్డుపై మురుగు.. పట్టించుకోరా..?

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతున్నా సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వచ్చే మార్గంలో తెల్లాపూర్ గ్రామ ముఖద్వారం వద్ద ఏళ్ల తరబడి రోడ్డుపై మురుగు నీరు చేరుతోంది. ఐనా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఈ సమస్యను పరిష్కరిస్తామంటూ అధికారులు లక్షలాది రూపాయలతో డ్రైనేజీ పైపులైన్‌లు వేశారు. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ ప్రాంతంలో బ్యాంక్, హోటల్స్ ఉన్నాయి. ఇక్కడికి వచ్చే ప్రజలు మురుగు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ మార్గంలోనే స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు రాకపోకలు చేస్తున్నా పట్టించుకోకపోవడం లేదు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


రోడ్డుపై నిలిచిపోయిన మురుగు


పార్కులో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

ప్రహరీ కూలె..

మురుగు చేరె..

ట్రీ పార్కు అభివృద్ధి పాలకులు,అధికారులకు పట్టదా..?

- పాడైన వాకింగ్ ట్రాక్
- అసంపూర్తిగా పార్కు పనులు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని ట్రీ పార్కు అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. చిన్నపాటి వర్షాలకే పార్కులో వరద నీరు చేరి వాకింగ్ ట్రాక్ మునిగింది. గత ఏడాది జీహెచ్‌ఎంసీ అధికారులు పార్కు అభివృద్ధి పనులు ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు కేవలం కొంత మేర వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. పిల్లల కోసం ఆటవస్తువులు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో పార్కు అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. పార్కులో పూర్తిగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కాలనీలో సేద తీరడానికి రెండు పార్కులు ఉన్నాయి. ఒక పార్కును కాలనీ సొంత నిధులతో అభివృద్ధి చేసుకున్నారు. మరో పార్కు యూనిసెంట్ స్కూల్ పక్కనే ఉంది. కానీ ఈ పార్కును ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కొండాపూర్‌లోని మై హోం మంగళ నుంచి ప్రేమ్‌నగర్, మార్తాండనగర్ మురుగు నీరు కూడా ఈ పార్కు పక్కన నుంచి వెళ్తుంది. వరదకు తోడు మురుగు నీరు పార్కులోకి చేరి దుర్గంధంగా మారింది. అధికారులు పార్కును పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అధికారులు పట్టించుకోవాలి

గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో లింక్ రోడ్డును ఆనుకొని ఉన్న ట్రీ పార్కును జీహెచ్‌ఎంసీ అధికారులు అభివృద్ధి చేయాలి. పార్కులో ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా చూడాలి. – శంకర్, కాలనీవాసి

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి

చిన్నపాటి వర్షానికే ప్రహరీగోడ కూలిపోగా, వాకింగ్ ట్రాక్ పాడైంది. పార్కు అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి. –మనోజ్, స్థానికుడు


గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో ట్రీ పార్కు దుస్థితి

19న కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో డాక్టర్లకు ఇంటర్వ్యూలు

గచ్చిబౌలి: కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసేందుకు డాక్టర్లకు ఈ నెల 19న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్‌ఎస్)రంగారెడ్డి జిల్లా డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. 2025 మార్చి 30 వరకు పని చేసేందుకు స్పెషలిస్ట్‌లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 19వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో పాటు అటెస్టేషన్ చేసిన జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు. ఓబీజీ, జీఎం, జీఎస్, ఆర్థో, రేడియాలజీ, జీడీఎంఓ తదితర విభాగాలలో పని చేసేందుకు 20 మంది డాక్టర్లు అవసరమని రంగారెడ్డి జిల్లాలోని టీవీవీపీ ఆస్పత్రులలో పని చేయాల్సి ఉంటుందన్నారు.

'మాస్టర్ చెఫ్' పోటీలు

పటాన్‌చెరు: వంట చేయడం ఒక నైపుణ్యమని, స్త్రీ, పురుష భేదం ఉండదని వక్తలు స్పష్టీకరించారు.మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కుకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 'మాస్టర్ చెఫ్' పోటీలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. గీతం ఆతిథ్య విభాగం సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం పాకశాస్త్రంపై అవగాహన పెంచడానికి, లింగభేదం లేకుండా వంట చేయడంపై నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న వారు వంటకాల రుచితో బాటు పోషకాహార పరిజ్ఞానంను కూడా ప్రదర్శించారు. కార్యక్రమంలో గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానమే..

జిన్నారం (పటాన్‌చెరు): ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని వివేకానంద స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. నేటి యువత అబ్దుల్ కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సేవాసమితి వ్యవస్థాపకుడు, యోగా గురువు సరెడ్డి గారి బిక్షపతి రెడ్డి, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


లక్ష్మీనారాయణ (ఫైల్)

మియాపూర్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్‌కు చెందిన లక్ష్మీనారాయణ(32) మియాపూర్ మయూరినగర్ కాలనీలో మై ఫ్యాబ్రిక్ కేర్ పేరిట వ్యాపారం చేస్తున్నాడు. ప్రతిరోజులాగే సోమవారం ఉదయం 9.30 గంటల సమయానికి మయూరినగర్‌కు వెళ్లాడు. వ్యాపారం ముగించుకుని రాత్రి 10.30కు ఇంటికి బయల్దేరాడు. సమయం గడుస్తున్నా లక్ష్మీ నారాయణ ఇంటికి రాకపోవడం.. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో భార్య ఝాన్సీరాణి స్నేహితుల, బంధువుల ఇళ్లల్లో విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. కాగా వ్యాపారంలో ఎవరి సపోర్టు లేనందున కుటుంబాన్ని సరిగ్గా చూసుకోలేకపోతున్నానని.. తాను చనిపోతున్నానని, వెతకవద్దని లెటర్ రాసి ఇంట్లో ఉంచాడు. దీంతో ఆందోళన చెందిన లక్ష్మీనారాయణ భార్య ఝాన్సీరాణి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికలు షురూ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి విద్యార్థి సంఘం ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ఆమోదం తెలిపినట్లు తెలిసింది. దీంతో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది.

రేపు జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని నిరుద్యోగులకు ఈనెల 17వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఉపాధి కల్పన శాఖ అధికారి నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐఎఫ్ఎల్ పరిశ్రమలో 50 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సర్టిఫికెట్లతో డీఆర్డీఓ కార్యాలయానికి హాజరు కావాలన్నారు.

సీపీఎం నూతన కమిటీ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరులో నిర్వహించిన సీపీఎం ఏరియా ద్వితీయ మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శిగా నాగేశ్వరరావు, ఏరియా కమిటీ సభ్యులుగా పాండురంగారెడ్డి, ఎండి వాజిద్ అలీ, శ్రీనివాసరావు, జార్జ్, శాంతకుమార్, పెంటయ్య, విష్ణు, లలితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే


కొండగట్టు ఆలయ ఆవరణలో పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

ఆల్విన్‌కాలనీ: పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ జన్మదినంను పురస్కరించుకొని మంగళవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందించి ఆశీర్వచనాలు అందజేశారు.

- కొండగట్టు ఆంజనేయస్వామి వారిని ఎమ్మెల్యే గాంధీ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారి శేష వస్త్రాలు అందజేసి, ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కార్పొరేటర్‌లు రాగం నాగేందర్‌యాదవ్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వ్యాయామం, పోషకాహారం, నిద్ర అవసరం

న్యూరో, స్పైన్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి



మాదాపూర్: ఎక్కువ సేపు కూర్చోవడం, ధూమపానం, స్టెరాయిడ్స్ తీసుకోవడం వంటివి వెన్నుముకను ప్రభావితం చేస్తాయని న్యూరో, స్పైన్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ వెన్నుముక దినోత్సవం సందర్భంగా మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన ఆహారం, సమయానికి నిద్రపోవడం వల్ల వెన్నుముక ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్ల మంది వెన్నునొప్పి, వెన్నుముక సమస్యలతో బాధపడుతునట్టు అంచనా అని పేర్కొన్నారు.

నిద్రమత్తులో భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన కిషోర్ (ఫైల్)

చందానగర్: భవనంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంధ్య తెలిపిన ప్రకారం రాజస్థాన్‌కు చెందిన కిషోర్ (25) ఇటీవల నగరానికి వచ్చి ఓ కాంట్రాక్టర్ వద్ద పనికి కుదిరాడు. తిరిగి రాజస్థాన్‌కు వెళ్ళిపోయాడు. మళ్లీ ఈ నెల 1వ తేదీన వచ్చి చందానగర్ నాగార్జున్ స్కూల్ పక్కన ఉన్న భవనంలో బిహార్‌కు చెందిన నలుగురు వ్యక్తులతో కలిసి నివాసముంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం పనికి వెళ్ళిన కిషోర్ సాయంత్రం వచ్చి మద్యం తాగడానికి వెళ్లాడు. రాత్రి 11 గంటలకు వచ్చి భోజనం చేసి ఆరు బయట పడుకుంటానని వెళ్ళాడని తోటి స్నేహితులు చెప్పారు. కాగా అర్ధరాత్రి నిద్ర మత్తులో జారి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం 6 గంటలకు చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్ట్‌మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులు చరిత్ర నేర్చుకునేలా స్ఫూర్తి పొందాలి

రచయిత, పరిశోధకుడు నీలేష్ నీలకాంత్

రాయదుర్గం: విద్యార్థులు చరిత్ర నేర్చుకునేలా స్ఫూర్తి పొందాలని ప్రముఖ రచయిత, చరిత్ర పరిశోధకుడు నీలేష్ నీలకాంత్ ఓక్ సూచించారు. మంగళవారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని కోరమ్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) సభ్యులను ఉద్దేశించి 'హీరోయిన్స్ ఆఫ్ ధర్మా: ది అన్‌కాంప్రమైజింగ్ స్పిరిట్ ఆఫ్ విమెన్ ఫ్రమ్ ఇండియన్ ఎపిక్స్' అనే అంశంపై ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా నీలేష్ మాట్లాడుతూ విద్యార్థులు సినిమా లేదా క్రికెట్‌ని చూసే ఉత్సాహంతో చరిత్రను చదవాలని కోరారు. చరిత్రను సరిదిద్దాలని, అందరూ నమ్మినట్టుగా రామాయణం 5వేల సంవత్సరాల క్రితం కాదని, మహాభారతం 7వేల సంవత్సరాలు, రామాయణం 14వేల సంవత్సరాలు, రుగ్వేదం 21వేల సంవత్సరాల క్రితందని అని ఆయన గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో తనకి చాలా అనుబంధం ఉందని, 17వ శతాబ్దంలో కర్నూలు చుట్టుపక్కల నివసించిన తన పూర్వీకులు ఆ ప్రాంతానికి దూరమయ్యారని వివరించారు. ఎఫ్ఎల్ఓ చైర్‌పర్సన్ ప్రియాగజ్దర్ మాట్లాడుతూ మన ధర్మ కథానాయికలు పోషించిన కీలకపాత్రను చర్చించే అంశంపై నీలేష్ ద్వారా వినిపించాలని నిర్ణయించి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎల్ఓ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశాన్ని ప్రారంభిస్తున్న నీలేష్‌నీలకాంత్ ఓక్, ఎఫ్ఎల్ఓ చైర్‌పర్సన్ ప్రియాగజ్దర్

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం పాటి చౌరస్తా సమీపంలో భిక్షాటన చేసే వృద్ధుడు (65-70) అనారోగ్యంతో పడిపోయాడు. దీంతో స్థానికులు చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి సంబంధించిన వారు ఉంటే బీడీఎల్ పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసం

రూ.21,35,000 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేట్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ నేరగాళ్లు భారీగా నగదు కాజేశారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగికి మార్చి 27వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. లింకును ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశారు. దీంతో ట్రేడింగ్ నిర్వాహకులు ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు.అతని నగదు ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ రాగా పెట్టుబడి, లాభాలు చూపిస్తూ వచ్చారు. ముందుగా బాధితుడు లక్ష రూపాయలు ఇన్వెస్ట్ చేయగా రెండు లక్షలు లాభాలు చూపించారు. పలు దఫాలుగా బాధితుడు మొత్తం రూ.21 లక్షల 35 వేలు ఇన్వెస్ట్ చేశాడు. తాను పెట్టిన నగదుతో పాటు, వచ్చిన లాభాలు ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లుగా గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాధితుడు పోగొట్టుకున్న నగదులో రూ.2 లక్షల 64 వేలు నగదు హోల్డ్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

పర్సనల్ లోన్ ఇప్పిస్తామంటూ..

పర్సనల్ లోన్ ఇప్పిస్తామంటూ వచ్చిన కాల్‌కి స్పందించిన ఓ ప్రైవేటు ఉద్యోగి రూ.74 వేలు పోగొట్టుకున్నాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలోని బృందావన్ కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి సెప్టెంబర్ 17వ తేదీన రూ. ఏడు లక్షల పర్సనల్ లోన్ ఇప్పిస్తామంటూ ఫోన్ కాల్ వచ్చింది. దీంతో బాధితుడు అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా డాక్యుమెంటేషన్, జీఎస్టీ, ఈఎంఐలకు రూ.74 వేలు నగదు వేశాడు. అనంతరం అపరిచిత వ్యక్తి స్పందించకపోవడంతో బాధితుడు తను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

టాస్కులు, కమీషన్ అంటూ.. రూ. 8 లక్షలు కాజేశారు

టాస్కులు, కమీషన్ పేరిట జరిగిన మోసంలో ఓ ప్రైవేట్ ఉద్యోగిని రూ.8 లక్షల 39 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన మహిళకు అక్టోబర్ 9వ తేదీన నగదు ఇన్వెస్ట్ చేసి, ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామని చెప్పి నమ్మించారు. దీంతో బాధితురాలు అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు ఇన్వెస్ట్ చేస్తూ, టాస్క్ పూర్తి చేస్తూ వచ్చింది. మొత్తం రూ.8 లక్షల 39 వేలు ఇన్వెస్ట్ చేసిన అనంతరం తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా, అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితురాలు తను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విరిగిన స్తంభాన్ని తొలగించండి



నిజాంపేట్: ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభం నేలకొరిగింది. నిజాంపేట్ కార్పొరేషన్ 24వ డివిజన్‌లో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి చెట్లకొమ్మలు విద్యుత్ స్తంభంపై విరిగి పడ్డాయి. దీంతో స్తంభం సగానికి విరిగింది. స్థానికులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరాను నిలిపివేశారు. అయితే విరిగిన స్తంభాన్ని తొలగించకపోవడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.